బొల్లాను కలిసిన జిల్లా ఐటీ విభాగం అధ్యక్షులు



వినుకొండ : వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబరు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును పల్నాడు జిల్లా ఐటీ విభాగం అధ్యక్షులు పులిచర్ల అంజిరెడ్డి, జిల్లా అనుబంధ కమిటీల నాయకులు, సోషల్ మీడియా పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు దోర్నాల రవి ఆదివారం ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ తమపై ఉంచిన బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలందరికీ బొల్లాతో కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

31న ఎన్జీవో అసోసియేషన్ ఎన్నికలు

నాదెండ్ల: చిలకలూరిపేట ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి కె. నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న ఓటర్ల జాబితా ప్రచురణ, 28న తుది జాబితా వెలువడించనున్నట్లు తెలిపారు. చిలకలూరిపేట పెన్షనర్స్ భవన్‌లో 31న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నామినేషన్లు, స్క్రూటినీ జరుగుతుందని పేర్కొన్నారు. అదేరోజు ఎన్నికలు నిర్వహించి గెలుపొందిన వారి వివరాలను వెల్లడిస్తామని వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను సహాయ ఎన్నికల అధికారి ఆనందనాథ్, ఏవీ కోటేశ్వరరావు పర్యవేక్షిస్తారని తెలిపారు.

అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

యడ్లపాడు: నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా పేలుడు పదార్థాల చట్టం ప్రకారం చర్యలు తీసుకొంటామని యడ్లపాడు ఎస్ఐ టి. శివరామకృష్ణ హెచ్చరించారు. టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టపాసుల విక్రయదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, లైసెన్సులు కలిగిన దుకాణాల వారు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. దుకాణాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.

రేపు చిరుమామిళ్లలో పాఠశాలల వార్షికోత్సవం

నాదెండ్ల: స్థానిక చిరుమామిళ్ల నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 17వ వార్షికోత్సవం, శ్రీమతి కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాల 92వ వార్షికోత్సవం ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు కిశోర్ తెలిపారు. ఇదే రోజు విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి జన్మదినం సందర్భంగా సాయంత్రం ఆరు గంటలకు ఉన్నత పాఠశాల ఆవరణలో పలు వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా డీఈవో ఎల్ చంద్రకళ, డెప్యూటీ డీఈవో షేక్ మహబూబ్ సుభాని, నాదెండ్ల ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

తాగునీరు నేలపాలు



నరసరావుపేట: ప్రాణాధారమైన వేల లీటర్ల తాగు నీరు గత కొన్నిరోజులుగా వృథాగా పోతున్నా నియంత్రించలేని పరిస్థితిలో మున్సిపాలిటీ ఉంది. స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని స్టేడియం సమీపంలో గల చప్టాపై ఏర్పాటు చేసిన పైపులు ద్వారా తాగునీటి లీకై నేల పాలవుతోంది. స్టేడియంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి బరంపేట నివాసితుల కోసం చప్టాపై ఏర్పాటు చేసిన పైపుల ద్వారా నీరు సరఫరా అవుతుంది. అయితే, రెండుచోట్ల లీకులు పడ్డాయి. మున్సిపల్ సిబ్బంది పట్టలు చుట్టి చేతులు దులుపుకున్నారు. నీరు మాత్రం బయటకు వచ్చి వృథాగా పక్కనే ఉన్న మురుగు కాలువలో కలిసి పోతోంది. సమీపంలోని నివాసితులు ఆ నీటినే పట్టుకుంటున్నారు. దీనిపై మున్సిపల్ డీఈ మహమద్ రఫీక్‌ను వివరణ కోరగా పైపులు మార్చేందుకు టెండర్లు పిలిచామని, అవి చివరి దశకు చేరాయని చెప్పారు. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో పైపులు మారుస్తామని తెలిపారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూలులో ముందస్తు దీపావళి వేడుకలు



నరసరావుపేట ఈస్ట్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఘంకార్ దీపావళి ఉత్సవ్–2025 ఘనంగా నిర్వహించారు. విద్యతో పాటు సంస్కృతిని మేళవిస్తూ ఆనందం, ఐక్యత, పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా దీపావళిని వైభవంగా నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాశరావు తెలిపారు. విద్యార్థులు రంగస్థలంపై సృజనాత్మకతకు అద్దం పట్టేలా పలు ప్రదర్శలు నిర్వహించారు. పలు స్టాల్స్ నిర్వహించి తమలోని సృజనాత్మకతను, వ్యాపారాత్మకతను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నాగోతు సబిత, ప్రిన్సిపాల్ రేఖా ఫులేకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నరసరావుపేట: పట్టణంలోని గ్రాండ్ సిటీలో ఆదివారం లూథరన్ హైస్కూలు 1982–83 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల మూడవ ఆత్మీయ సమ్మేళనం సందడిగా జరిగింది. తొలుత కొండా శోభారాణి, దేవరపల్లి సంధ్య, జలసూత్రం అనురాధ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ప్రతి ఏడాది ఇదే విధంగా నిర్వహించుకోవాలని అంతా కలిసి తీర్మానం చేశారు. కార్యక్రమాన్ని బొందిలి శ్రీనివాససింగ్, కుందా సురేష్, ఏసుదాసు, ఏడుకొండలరావు, వెంకటేశ్వర్లు, జీవీఆర్ సురేష్, ఎం.విజయకుమార్, లాల్, బాషా పర్యవేక్షించారు.

కబడ్డీ విజేత కృష్ణవేణి కళాశాల



నరసరావుపేట ఈస్ట్: నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా కబడ్డీ రోలింగ్ ట్రోఫీని కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు వరసగా రెండవ సారి కైవశం చేసుకొంది. ఈనెల 16, 17 తేదీల్లో లాం చలపతి ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో తమ కళాశాల జట్టు ప్రథమ స్థానంతో పాటు నలుగురు విద్యార్థినులు ఎం.త్రివేణి, ఎం.కావేరి, ఎల్.లక్ష్మీదేవి, డి.కృష్ణశ్రీ వర్సిటీ జట్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 29వ తేదీ నుంచి చెన్నైలో జరగనున్న సౌత్‌జోన్ పోటీలో పాల్గొంటారని ఆయన వివరించారు.

కూటమి నేతల కక్ష సాధింపు తగదు

జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు పీఎస్ ఖాన్



వినుకొండ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండ నియోజకవర్గంలో ముస్లింలపై దాడులు పెరిగిపోయాయని జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు పీఎస్. ఖాన్ తెలిపారు. వినుకొండలో ఇటీవల ఓ వివాహ వేడుక సందర్భంగా ముస్లింలు ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు డీజే సౌండ్‌తో వెళుతుండగా, పోలీసులు వారిని అడ్డుకొని స్టేషన్‌కు పిలిపించి నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. స్థానిక ఎమ్మెల్యే జీవీ ఇలాంటి వ్యవహారాలను ప్రోత్సహించడం మంచిది కాదని తెలిపారు. ముస్లింలలో ఒక వర్గాన్ని వేరు చేస్తూ, రషీద్ హత్య దగ్గర నుంచి నేటి వరకు కేసులు నమోదు చేయడం, వేధించడం వంటి పరిణామాలను ఆయన ఖండించారు. ఏకంగా 11మందిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో ఇబ్బందికర వాతావరణం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేపై ఉందని ఆయన సూచించారు.

రొంపిచర్ల మండలంలో మోస్తరు వర్షం

రొంపిచర్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం చల్లగా ఉంది. ఆకాశంలో మబ్బులు కమ్మి పగలంతా అడపాదడపా చినుకులు పడ్డాయి. చల్లని వాతావరణం నెలకొనడంతో మాగాణి పొలాల్లో వ్యవసాయ పనులు సజావుగా సాగాయి.రొంపిచర్లలో ఆదివారం ఉదయానికి 3.6 ఎం.ఎం. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు.

రౌడీషీటర్లపై నిఘా

శావల్యాపురం: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు పురస్కరించుకొని నియోజవర్గంలోని అన్ని మండలాల్లోని రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు వినుకొండ రూరల్ సీఐ బొప్పన బ్రహ్మయ్య తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దీపావళి పండుగను ప్రజలంతా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో నిఘా పెంచినట్లు చెప్పారు.ఆయనతో పాటు ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు, ఏఎస్ఎస్సై బాజీ, రైటరు బాష తదితరులు ఉన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

[illegible]

చిలకలూరిపేట.
తేది. 19-10-2025

అడ్వకేట్లు:-
1) కె. సంగమేశ్వరరావు–Cell: 9912281014
2) డి. మహేష్–Cell: 9866299800
నరసరావుపేట సెంటర్, చిలకలూరిపేట.